కాంగ్రెస్ మోసం తేటతెల్లమైంది : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ మోసం తేటతెల్లమైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని రోజులపాటు మోసపూరితంగా వ్యవహరించిందని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన స్టేతో 42 శాతం రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ సర్కారు ఇంతకాలం చేసిందంతా డ్రామా తప్ప మరొకటి కాదని రుజువైపోయిందని పేర్కొన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలు, చట్టం పరీక్షకు నిలవకుండా వ్యవహరించిన తీరు వల్లనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో కలరింగ్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని బిసిలను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. కేవలం మభ్యపెట్టడానికే తెచ్చిన జీవో న్యాయస్థానాల్లో నిలబడదని బిఆర్ఎస్ చెప్పిన మాట అక్షరాలా నిజమైందని ఆయన స్పష్టం చేశారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

- నారాయణపేట జిల్లాలో ఘటన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడి ఓ మహిళ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణ పేటలోని పళ్ల వీధికి చెందిన పద్మ(35) అనే మహిళ.. గురువారం ఉదయం నుంచి పొలంలో వ్యవసాయ పనులు చేస్తుంది. సాయంకాలం అకాల వర్షం కురవడంతో పిడుగుపాటుకు గురై మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి మృతదేహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

విదేశీ నగదు కోసం వైజ్ ట్రావెల్ కార్డు ఆవిష్కరణ

హైదరాబాద్ :ప్రపంచ వ్యాప్తంగా డబ్బును సులభంగా నిర్వహించడానికి వీలు కల్పిస్తోన్న గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ వైజ్ భారత్‌లో వైజ్ ట్రావెల్ కార్డ్ వెయిట్‌లిస్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. దీంతో 40 పైగా విదేశీ కరెన్సీలను హోల్డ్ చేసి, ఖర్చు చేయవచ్చని వైజ్ దక్షిణాసియా విస్తరణ లీడ్ టనియా భరద్వాజ్ పేర్కొన్నారు. భారతీయులు ఎక్కువగా వెళ్లే యుఎఇ, థాయిలాండ్, సింగపూర్, యుఎస్ఎ, యుకె వంటి దేశాల కరెన్సీలతో పాటు మరెన్నో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వైజ్ యాప్‌లో కరెన్సీని వెంటనే మార్చుకోవచ్చన్నారు. దేశీయ కరెన్సీ లేకపోయినా సరే హోటల్ బుక్ చేయాలన్నా, దుబాయ్‌లో సరుకులు కొనాలన్నా వైజ్ కార్డ్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. డిజిలాకర్, వీడియో కెవైసి ద్వారా ఈ ఖాతాను సులభంగా తెరుచుకోవచ్చన్నారు.


లద్దాఖ్ ప్రజల హక్కుల కోసం ఉద్యమాలు

- కేంద్రపాలిత ప్రాంతంగా చేసినా జరగని అభివృద్ధి
- 6వ షెడ్యూల్‌లో చేర్చకుండా కేంద్రం మోసం
- తప్పుడు వాగ్దానాలతో బిజెపి అభాసుపాలు
- ఎస్‌వికె వెబినార్‌లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి



ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

జమ్మూకాశ్మీర్‌లోని లద్దాఖ్ ప్రజల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే మహమ్మద్ యూసఫ్ తరిగామి పిలుపునిచ్చారు. దేశంలోని ప్రజలు అక్కడి వారికి మద్దతుగా నిలబడి ఉద్యమించాలని చెప్పారు. 'లద్దాఖ్‌లో ఏం జరుగుతోంది' అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వెబినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1950లోనే భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ జమ్మూకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ని వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఆర్టికల్ 370 ఉండడం వల్ల జాతీయ సమైక్యతకు ఆటంకం కలుగుతుందంటూ ఆనాడే విషబీజాలు నాటారని విమర్శించారు. ఆయన వారసులు 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తామంటూ ప్రకటించారని అన్నారు. బిజెపి రెండోసారి అధికారంలోకి రాగానే 2019, ఆగస్టు ఐదున ఆర్టికల్ 370తోపాటు ఆర్టికల్ 35ఎ ని కూడా రద్దు చేసిందన్నారు. జమ్మూకాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక స్వయంప్రతిపత్తి, రక్షణలను తొలగించిందని అన్నారు. జమ్మూకు రాష్ట్ర హోదా, లద్దాఖ్, కాశ్మీర్‌లను కేంద్రపాలిత ప్రాంతాలుగా చేసిందని వివరించారు. అయితే లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతంగా మారితే అభివృద్ధి చెందుతుందంటూ అక్కడి ప్రజలు భావించి సంబరాలు చేసుకున్నారని చెప్పారు. ఉద్యోగాలు వస్తాయని, భూములకు రక్షణ ఉంటుందనీ, స్వేచ్ఛగా జీవించొచ్చని ప్రజలు భావించారని అన్నారు. ఈ ప్రాంతాన్ని ఆరో షెడ్యూల్‌లో చేరుస్తామంటూ కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. కానీ ఆరేండ్లయినా అభివృద్ధి జరగలేదనీ, ఆరో షెడ్యూల్‌లో చేర్చలేదనీ, యువతకు ఉద్యోగాలు రాలేదని వివరించారు. కేంద్రంలోని బిజెపి పాలకులు పట్టించుకోకుండా అక్కడి ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేసి మోసం చేశారని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బిజెపి విఫలమైందన్నారు. దీంతో బిజెపి నాయకులు తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు ప్రజలు వాస్తవాలు తెలుసుకుని వాగ్దానాలను అమలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉద్యమిస్తున్నారని అన్నారు. లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలంటూ సోనం వాంగ్‌చుక్ ఉద్యమిస్తే ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపారని విమర్శించారు. ఉద్యమిస్తున్న ప్రజలపై నిర్బంధం ప్రయోగిస్తున్నారనీ, దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని చెప్పారు. ఇంకోవైపు ప్రజలను మతం పేరుతో విభజించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. హిందూత్వ రాజకీయాలను ప్రజలు ఐక్యంగా ఓడించాలని పిలుపునిచ్చారు. లద్దాఖ్, జమ్మూ, కాశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక హక్కులు, లౌకిక విలువల పరిరక్షణ కోసం ఉద్యమించాలని చెప్పారు. అక్కడి వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. వాటిని తిప్పికొట్టాలని అన్నారు. షేక్ అబ్దుల్లా జయంతి సందర్భంగా ఉన్న సెలవు దినాన్ని హరిసింగ్ జయంతికి మార్చి అక్కడి హిందూ, ముస్లిం ప్రజల మనోభావాలతో కేంద్రం చెలగాటమాడుతున్నదని విమర్శించారు. లద్దాఖ్, జమ్మూ, కాశ్మీర్ ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నారనీ, దేశంలోని ప్రజలంతా వారికి అండగా నిలబడాలనీ, సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. తరిగామి ప్రసంగాన్ని ప్రముఖ జర్నలిస్టు కొండూరి వీరయ్య తెలుగులోకి అనువాదం చేశారు.



అవార్డు అందుకుంటున్న హరికిరణ్

సమాచార హక్కు అవార్డు అబ్కారీ శాఖ పనితీరుకు నిదర్శనం

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సమాచార హక్కు చట్టం 2025లో భాగంగా బెస్ట్ పర్‌ఫార్మెన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ కింద అవార్డు రావడం ఎక్సైజ్ శాఖ పనితీరుకు నిదర్శనమని ఆ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు. గురువారం రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీద అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవార్డును ఎక్సైజ్ శాఖ ఉద్యోగులందరికీ అంకితమిస్తున్నట్టు పేర్కొన్నారు. గత ఐదేళ్లలో అబ్కారీ శాఖకు సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించినందుకు ఆయన సిబ్బందిని అభినందించారు. భవిష్యత్‌లో అన్ని విషయాల్లో తమ శాఖ పారదర్శంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు విధుల్లో నిబద్ధతతో పని చేయాలని ఉద్యోగులకు సూచించారు.

చేగువేరా స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాడుదాం

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ



చే గువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ విప్లవకారుడు, సామ్రాజ్య వాదానికి సింహస్వప్నం చేగువేరా అని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో చేగువేరా 58వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విజయ్ కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు మాట్లాడారు. ప్రపంచంలో దోపిడీ లేని సమాజం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 39 సంవత్సరాలకే తనువు చాలించారని గుర్తు చేశారు. చే గువేరా జీవితం నేటి యువత, విద్యార్థులు అధ్యయనం చేసి సమాజంలో అసమానతలు, దోపిడీ లేని, పేదరికం లేని వ్యవస్థ కోసం పోరాడాలని సూచించారు. పదవులు కోసం పార్టీలు మారే ఈ రోజుల్లో క్యూబా దేశానికి అత్యున్నత పదవిలో ఉండి కూడా దానికి రాజీనామా చేసి బొలీవియా స్వాతంత్ర్యం కోసం అమెరికా సైన్యంతో గెరిల్లా పోరాటాన్ని నిర్వహించాడని చెప్పారు. ప్రపంచానికి వైద్యంలో వెన్నుదన్నుగా క్యూబా నిలుస్తుందంటే నాడు చేగువేరా విద్య, వైద్యంపై చేసిన అసమాన కృషి కారణమని తెలిపారు. క్యూబా, వెనిజులా లాంటి దేశాలను అమెరికా అణచివేసేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. చే స్ఫూర్తితో సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని విద్యార్థి యువతరానికి పిలుపునిచ్చారు. సభలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.డి.జావేద్, రాష్ట్ర నాయకులు రాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యానపంటల ఉత్పత్తి పెంచడమే లక్ష్యం

- రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక–2035 ఆవిష్కరణలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఉద్యాన పంటల ఉత్పత్తిని పెంచేందుకు 2030 వరకు అనుసరించాల్సిన లక్ష్యాలను ఈ ప్రణాళికలో పేర్కొన్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన 'తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక–2035' గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఈ ప్రణాళికను సిఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డి.రాజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. రాబోయే ఐదేళ్లలో 1.32 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు, 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటల విస్తీర్ణం, దిగుబడులు, ఉత్పత్తిని పెంచడం లక్ష్యమంగా ప్రణాళికలో నిర్దేశించారు. వచ్చే ఐదేళ్లలో రూ. 921.40 కోట్లు సాగు పెట్టుబడిగా, అలాగే రూ.942.50 కోట్లు డ్రిప్ కోసం పెట్టుబడిగా కేటాయిస్తే, ఒక్క రూపాయి పెట్టుబడికి నాలుగు రూపాయల లాభం పొందే అవకాశం ఉందని ప్రణాళిక పేర్కొంది. ఈ విశ్వవిద్యాలయం రూపొందించిన రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రస్తుత విస్తీర్ణంలో అమలు చేయడం వల్ల ఏటా రూ.1,341 కోట్ల ఉత్పత్తి విలువను సాధించవచ్చని అంచనా వేసింది. వివిధ పంటల్లో మిగులు, ఉత్పత్తి లోటు ప్రాతిపదికగా కార్యాచరణను అమలు చేయాలని, మిగులు ఉత్పత్తి ఉన్న పంటలు, లోటు ఉత్పత్తి ఉన్న పంటలు గుర్తించి, వాటికి అనుగుణంగా విస్తీర్ణం పెంచడం, ఉత్పాదకత సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, పంట యాజమాన్యం, మార్కెటింగ్ వంటి అంశాలను ప్రణాళికలో సమగ్రంగా వివరించారు. ఈ ప్రణాళిక పుస్తకాన్ని డాక్టర్ డి.రాజిరెడ్డి, డాక్టర్ ఎ.భగవాన్, డాక్టర్ జి.పి.సునంది రూపొందించారు.

కాంగ్రెస్‌ది రిజర్వేషన్ల డ్రామా

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బిసిలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని మాజీ మంత్రి టి హరీశ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 నెలలుగా బిసి రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన రేవంత్‌రెడ్డి, గల్లీలో కొట్లాడుతున్నట్టు డ్రామా క్రియేట్ చేసారే తప్ప, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్ట బద్ధత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిందిపోయి తెలివిగా దాన్ని పక్కదోవ పట్టించారని విమర్శించారు. బిసిల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్టు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జిఒ ఇచ్చి కొత్త నాటకానికి తెరతీసారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా డ్రామాలు ఆపాలనీ, బిసిల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చాలని సూచించారు. అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయాలనీ, ఢిల్లీ వేదికగా యుద్ధ భేరి మోగించాలనీ, బిఆర్ఎస్ బిసిల కోసం నిలబడుతుందని తెలిపారు.



అకాల వర్షం.. తడిసిన మొక్కజొన్న

- 25 రోజుల క్రితమే మార్కెట్ యార్డ్‌కు వచ్చిన మక్కలు
- కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో అక్కడే పోసి పడిగాపులు కాస్తున్న రైతాంగం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట పట్టణంలో బుధవారం రాత్రి ఒంటిగంట సమయంలో కురిసిన అకాల వర్షంతో మార్కెట్‌యార్డులోని వేల క్వింటాళ్ల మక్కలు తడిసిపోయాయి. అక్కడే కాపలా కాస్తున్న రైతులు ధాన్యంపైన కవర్లు కప్పి జాగ్రత్త పడినా.. కొంతమేరకు కొట్టుకుపోయింది. గురువారం తెల్లవారుజాము నుండే తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టే ప్రయత్నం చేశారు. ఓ మహిళా రైతు తమ మక్కల వద్ద నిలిచిన నీటిని బట్ట సహాయంతో తొలగించడం చూసిన వారిని ఆవేదనకు గురిచేసింది. మరో రైతు తడిసిన మక్కలను తట్టల్లో ఎత్తి దూరంగా ఆరబోశారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సుమారుగా 25 రోజుల నుంచి మొక్కజొన్న ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చామని, అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయలేదని వాపోయారు. దాంతో కొంతమంది రైతులు ప్రయివేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించుకున్నారు. మరికొంతమంది రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే అమ్ముకుంటామంటూ మార్కెట్‌యార్డుకు మక్కలను తరలించి ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో వర్షం కురవడంతో మొక్కజొన్న తడిసి ముద్దయిపోయింది. ఈ నష్టాన్ని ఎవరు భరించాలంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి, తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అడ్డగోలుగా పెంచిన బస్ ఛార్జీలను తగ్గించాలి

- ఆర్‌టిసి నష్టాలను ప్రభుత్వమే భరించాలి
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు
- చలో బస్ భవన్ కార్యక్రమంలో ఉద్రిక్తత
- పలువురు బిఆర్ఎస్ నాయకులు అరెస్ట్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన బస్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. ఆర్‌టిసి బస్సుల చార్జీల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కెటిఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, ముఠా గోపాల్, సికింద్రాబాద్ రెతిఫైల్ బస్‌స్టాండ్ నుంచి బస్సు భవన్‌కు ఆర్‌టిసి బస్సులో వచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెహిదీపట్నం నుంచి ఆర్‌టిసి బస్సులో బస్సు భవన్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో ఆర్‌టిసి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ బిఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కెటిఆర్, హరీశ్‌రావును ఆర్‌టిసి క్రాస్ రోడ్డు వద్దనే పోలీసులు నిలువరించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో వారు నడుచుకుంటూ బస్ భవన్‌కు చేరుకొని ఆర్‌టిసి ఎమ్‌డి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే కెటిఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరంకుశ పాలన నడుస్తున్నదన్నారు. కాంగ్రెస్ సర్కార్ అడ్డగోలుగా పెంచిన ఆర్‌టిసి బస్ చార్జీలను నిరసిస్తూ ఛలో బస్ భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చామని తెలిపారు. మహిళలకు ఉచితమని చెప్పి పురుషులకు టికెట్ ధరలు పెంచారని విమర్శించారు. విద్యార్థుల బస్‌పాస్ ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. నిరుపేదల నడ్డి విరుస్తూ అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని నిరసన తెలుపుతుంటే తమ నేతలను అన్యాయంగా అరెస్టు చేశారని ఇది దుర్మార్గమైన చర్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 20 నెలల పాలనలో అయిదు సార్లు బస్సు చార్జీలు పెంచారనీ, భార్యకు ఫ్రీ అని భర్తకు, పిల్లలకు టికెట్ రేటు డబుల్ చేశారని ఆరోపించారు. ఇప్పటికే జీవో నెంబర్ 53, 54తో కొత్త వాహనాలపై లైఫ్ టాక్స్ పెంచి ప్రజలపై భారం వేశారన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

- ఒక్కొక్కరికి రూ.15 వేల జరిమానా
- ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి తీర్పు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్దునూరు గ్రామ శివారులో సూర దుర్గయ్య అనే వ్యక్తిని 2021లో హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.15వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి నారాయణ తీర్పు వెలువరించారు. మంచిర్యాల జిల్లా దండపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన సూర దుర్గయ్య (60) అనే వ్యక్తి అదే గ్రామంలో బండ కొట్టే పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. అదే గ్రామానికి చెందిన దారంగుల రాజేశం, దారంగుల రాజు అనే అన్నదమ్ములతో సూర దుర్గయ్యకు పాత గొడవలు ఉండేవి. ఈ క్రమంలో 2021 ఫిబ్రవరి 19న దుర్గయ్య మద్యం సేవించి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. మరుసటి రోజు బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్దునూరు గ్రామ శివారులోని గుట్టల ప్రాంతంలో దుర్గయ్యను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ముఖం, తలపై బండరాయితో కొట్టి, గాజు సీసాలతో పొడిచి హత్య చేశారని గుర్తించారు. మృతుని కుమారుడు సూర శేఖర్ ఫిర్యాదు మేరకు బుగ్గారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి రాజు, రాజేశంను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్షులను విచారించిన తరువాత నేరం రుజువు కావడంతో దారంగుల రాజు, రాజేశంకు జీవిత ఖైదుతో పాటు రూ.15వేల చొప్పున జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని అన్నారు. దోషులకు శిక్ష పడటంలో కృషి చేసిన పిపి మల్లేశం, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఇన్‌స్పెక్టర్లు రాంచందర్‌రావు, కోటేశ్వర్, సిఎంఎస్ ఎస్‌ఐ శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ శ్రీధర్, సీఎంఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్, కిరణ్ కుమార్‌ను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

సోలార్ విద్యుత్ వినియోగంపై ఆసక్తిగా ఉన్నాం

- ప్రతిపాదనలను అధ్యయనం చేస్తాం
- జర్మనీ ప్రతినిధులతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



జర్మనీ ప్రతినిధులతో సమావేశమైన భట్టి విక్రమార్క

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్‌రంగ అభివృద్ధిలో భాగంగా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంలో ఆసక్తిగా ఉన్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జర్మనీ ప్రతినిధులతో డిప్యూటీ సిఎం సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోలార్ రంగంపై ఆసక్తిగా ఉందని తెలుసుకొని కొన్ని ప్రతిపాదనలతో వచ్చినట్టు జర్మనీ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సిఎం జర్మనీ ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలోని వ్యవసాయ పంపుసెట్లతో పాటు గృహ జ్యోతి లబ్ధిదారులకు సోలార్ విద్యుత్ అందించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులు, గృహ జ్యోతి వినియోగదారులకు ప్రతినెలా కచ్చితమైన ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. జర్మన్ ప్రతినిధులు సూచించిన సోలార్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ రాష్ట్రంలో ఏ విధంగా అనుసంధానం చేసుకోగలం, తెలంగాణ విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేసుకోవడానికి జర్మన్ బృందం ప్రతిపాదనలు ఏ మేరకు ఉపయోగపడతాయో అధ్యయనం చేయాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు. జర్మనీ ప్రతినిధులు తీసుకొచ్చిన ప్రతిపాదనలపై అధ్యయనం చేసి ఓ నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌ను డిప్యూటీ సిఎం ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్‌కో సిఎమ్‌డి కృష్ణభాస్కర్, ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి ముషారఫ్ ఫారూకీ, రెడ్కో సిఎమ్‌డి అనిలా, జర్మన్ ప్రతినిధులు డాక్టర్ సెబాస్టియన్, డాక్టర్ రఘు చలిగంటి తదితరులు పాల్గొన్నారు.

'హ్యామ్'తో రాష్ట్ర రోడ్లకు మహర్దశ

- మూడేళ్లలో అద్దంలా మారుస్తాం
- ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

హ్యామ్ విధానంతో రాష్ట్రంలోని రోడ్లకు మహర్దశ పట్టనుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వచ్చే మూడేళ్లల్లో ఆర్‌అండ్‌బి రోడ్లను అద్దంలా తయారుచేస్తామని ప్రకటించారు. దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలుస్తుందన్నారు. రోడ్ల అభివృద్ధికి సహకరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో హ్యామ్ రోడ్ల నిర్మాణంపై ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమక్షంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, ఫైనాన్స్ సెక్రటరీ హరిత, ఆర్ అండ్ బి అధికారులు జయభారతి, బివి రావు, పలువురు ఆర్‌అండ్‌బి ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు. హ్యామ్ రోడ్ల ప్రతిపాదనలకు సంబంధించిన వివరాలను స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హ్యామ్ ద్వారా వచ్చే మూడు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్ బి రోడ్లు అద్దంలా చేయనున్నామని తెలిపారు. దేశానికే రోల్ మోడల్‌గా నిలపాలనే లక్ష్యంతో ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని అన్నారు. రోడ్డు ప్రమాదాలు లేకుండా నిర్మాణంపై ప్రధాన దృష్టి సారించామని చెప్పారు. దశలవారీగా హ్యామ్ రోడ్లు చేపట్టనున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. మొదటిదశలో సింహ భాగం హ్యామ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. అందులో సింగిల్ , డబుల్ వరుసలు, నాలుగు వరుసల వారిగా రోడ్ల బలోపేతం చేయనున్నామన్నారు. దీంతో పాటు రోడ్ల వెడల్పు చేయనున్నట్టు తెలిపారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరుసలు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు వరుసల రోడ్ల నిర్మాణం చేయాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. ఇందులో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తున్నామన్న మంత్రి, ఒక అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఇంకో అసెంబ్లీ నియోజకవర్గానికి కనెక్టివిటీ కారిడార్లుగా హ్యామ్ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మొదటి ఫేజ్‌కు ఒకటి, రెండు నెలల్లో టెండర్లు పిలవనున్నట్టు మంత్రి వెల్లడించారు.

ట్రాఫిక్ సర్వేను దృష్టిలో పెట్టుకొని హ్యామ్ రోడ్లు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

రాష్ట్రంలో దశలవారీగా హ్యామ్ రోడ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణక్రమంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని చెప్పారు. రోడ్ల నిర్మాణ క్రమంలో ట్రాఫిక్ సర్వేను గమనంలో పెట్టుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సహకరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు మంత్రి తన ఛాంబర్‌లో ఆర్ అండ్ బి ఉన్నతాధికారులతో శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదల కారణగా దెబ్బతిన్న రోడ్ల వివరాలపై ఆరా తీశారు. పూర్తి వివరాలు త్వరలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మంచి రోడ్లు రాష్ట్ర అభివృద్ధికి సోపానమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, ఆర్ అండ్ బి ఇఎన్‌సిలు మోహన్‌నాయక్, జయభారతి, సిఇలు బివి.రావు, కిషన్ రావు పలువురు ఎస్ఇలు, ఈ.ఈ లు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

గ్రేటర్ హైదరాబాద్‌లో కొనసాగుతున్న ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని మరింత పరిశుభ్రంగా మార్చే లక్ష్యంతో ఈ నెల 6న నుంచి జిహెచ్‌ఎంసి చేపట్టిన ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ (ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం) గురువారం పలు ప్రాంతాల్లో కొనసాగింది. మూడు రోజుల్లో నగరంలోని 695 కాలనీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం అమలు చేశారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, సానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్, డిప్యూటీ కమిషనర్‌లు పర్యవేక్షిస్తున్నారు. నగర వ్యాప్తంగా 1082.5 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ చేయగా, 365 మెట్రిక్ టన్నుల సి అండ్ డి వ్యర్థాలు తొలగించారు.



రష్మికతో క్రాక్స్ నూతన క్యాంపెయిన్

న్యూఢిల్లీ : గ్లోబల్ ఫుట్‌వేర్ బ్రాండ్ క్రాక్స్ తమ 'షేర్ ది జాయ్' ప్రచారంతో పండుగ సీజన్‌ను మరోసారి ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. ఈ సీజన్‌లో క్రాక్స్ గ్లోబల్ అంబాసిడర్ రష్మిక మందన్నతో సరికొత్త బ్రాండ్ క్యాంపెయిన్‌ను చేపడుతోన్నట్లు క్రాక్స్ ఇంటర్నేషనల్ మార్కెటింగ్ హెడ్ యాన్ లే బోజెక్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులు తాళలేక.. మనస్తాపానికి గురైన రైతు.. ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన హనుమకొండ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో గురువారం జరిగింది. స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దెల శ్రీనివాస్(44) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు దిగుబడి రాక నష్టం రావడం, అలాగే కుటుంబ ఆర్థిక భారం, ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. దాంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ఎఫ్‌సి ఫర్నిచర్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న యాజమాన్యం

హైదరాబాద్‌లో ఎఫ్‌సి ఫర్నిచర్ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : మాడ్యులర్, ఎర్గోనామిక్ ఆఫీస్ ఫర్నిచర్ ఉత్పత్తుల సంస్థ ఎఎఫ్‌సి ఫర్నిచర్ సొల్యూషన్స్ తన ఆధునిక స్టోర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. దీన్ని బంజారాహిల్స్‌లో 5000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐఐఐడి హైదరాబాద్ రీజినల్ చాప్టర్ మేనేజింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. ఇది కార్పొరేట్ సంస్థలు, ఆర్కిటెక్ట్‌లు, డిజైనర్లు, పూర్తి శ్రేణి మాడ్యులర్ ఫర్నిచర్, వినూత్న వర్క్‌స్పేస్ సొల్యూషన్‌లను అందించేలా రూపొందించబడిందని ఎఎఫ్‌సి ఫర్నిచర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు మానోజ్ తోమర్ తెలిపారు.

చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం

- రిటైర్డ్ ఇంజనీర్లు, వ్యవసాయ అధికారుల సమావేశంలో కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం అవసరమని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అభిప్రాయపడ్డారు. పదేండ్ల కాలంలో వేలాది చెరువులు అన్యాక్రాంతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల పరిరక్షణ కోసం కమిషన్ సూచన మేరకు ప్రభుత్వం నీటి సంఘాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నీటి సంఘాల నియామకం, విధివిధానాలపై గురువారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో రిటైర్డ్ ఇంజనీర్లు, నిపుణులు, వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, రాములు నాయక్‌తోపాటు రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజనీర్లు బి. నాగేంద్రరావు, జి. సురేందర్, రవీందర్ రెడ్డి (వాలంతరి), డా. వెంకటరాధా, సీనియర్ సైంటిస్ట్, ఇక్రిశాట్ భీం ప్రసాద్, ఓఎస్‌డీ టు ఇరిగేషన్ మినిస్టర్ నర్సింహరావు, కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, హరివెంకట ప్రసాద్, శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ... రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కబ్జాదారులు రెచ్చిపోతున్నారని చెప్పారు.

ఆర్థికావృద్ధికి దోహదపడే విధానాలు అనుసరించాలి

- అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలు సానుకూల దృక్పథంతో అమెరికా, భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, హెచ్1 బి వీసాలపై విధించిన కఠిన నిబంధనలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావం చేయటంతో పాటు అస్థిరతకు, అపార్థానికి దారి తీస్తాయన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థికవృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణకు వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలను పంచుకున్నారు. వారితో గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సిఎం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదనీ, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానాలను ప్రభుత్వం ఇప్పటికే కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ ప్రపంచ నగరంగా అందరినీ ఆకర్షిస్తోందనీ, దేశ విదేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీ పడుతోందనీ, ఇక్కడ మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడంలో ప్రపంచ ప్రమాణాలకు సవాలుగా ఉందని ఆయన అన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందనీ, 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని చెప్పారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి వారికి తెలిపారు. హైదరాబాద్‌లో గేమ్ ఛేంజర్ ప్రాజెక్టులు చేపడుతున్నామని వివరించారు.

భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, మాన్యుఫాక్చర్ జోన్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. డ్రై పోర్ట్ ఏర్పాటు చేసి పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్ట్ వరకు 12 లైన్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్ కనెక్టివిటీ ఉండేలా రవాణా సదుపాయాలు విస్తరిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ నుంచి చెన్నై వరకు, హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలున్నాయన్నారు. హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టామనీ, సిటీలో ఇప్పుడున్న మెట్రో రైలును అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నట్టు చెప్పారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి కొత్త మార్గాలను తెరుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

30 వేల ఎకరాల్లో హైదరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయనీ, మొత్తం 500 కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావాలనీ, ఫ్యూచర్ సిటీలో పాలుపంచుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. 'చైనా ప్లస్ 1' వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ఎంపికగా నిలుస్తుందనీ, అటువంటి భవిష్యత్తు ప్రణాళికలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏఐ సిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచనలున్నాయని తెలిపారు. ఏఐ రంగంలో రాష్ట్రాన్ని దేశానికే స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఇప్పటికే పేరొందిన కంపెనీలు హైదరాబాద్లో గ్లోబల్ కెపాసిటీ సెంటర్స్ ఏర్పాటు చేశాయనీ, వీటిని గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. అమెరికా ప్రతినిధి బృందంలో హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి, వాల్ స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్ ప్రొఫెసర్ వాల్టర్ రస్సెల్ మీడ్, రేషనల్ వేవ్ క్యాపిటల్ పార్టనర్స్ సిఇఒ మార్క్ రోసెన్‌బ్లాట్, క్రౌ హోల్డింగ్స్ చైర్మన్ హర్లాన్ క్రో, ఈగిల్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు రావెనెల్ కర్రీ, బిల్లింగ్స్లీ కంపెనీ భాగస్వామి హెన్రీ బిల్లింగ్స్‌తో పాటు మొత్తం 16 మంది ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ఈ ప్రతినిధి బృందం భారత్‌లో పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలను స్వీకరిస్తోంది.

ఎసిబి వలకు చిక్కిన చిట్యాల తహశీల్దార్

- రూ.2 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహశీల్దార్ గుగులోతు కృష్ణ గురువారం రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కారు. ఎసిబి నల్లగొండ రేంజ్ ఆఫీసర్ సిహెచ్.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 172లో మ్యుటేషన్ చేయడానికి, సర్వే నెంబర్ 167 ఇన్‌స్పెక్షన్ చేయడానికి తహశీల్దార్ గుగులోతు కృష్ణ రూ.10 లక్షలు డిమాండ్ చేయగా రూ.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రూ.2లక్షలు కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహశీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గతంలోనూ ఈయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. తహశీల్దార్ నివాసంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎసిబి అధికారులు తెలిపారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ రాకుండా అన్ని రాజకీయ పార్టీలకు చేసిన ద్రోహానికి నిరసనగా శుక్రవారం బంద్ నిర్వహిస్తున్నట్టు పలు సంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు గురువారం పాపని నాగరాజు (కుల నిర్మూలన వేదిక), కొంకల వెంకటనారాయణ (సామాజిక తెలంగాణ మహాసభ), పి వెంకటేష్ గౌడ్ (ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్), బూర్గుల నాగేంద్రర్ (తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం), పి.రేణుక (జాబాలి పబ్లికేషన్) ఒక ప్రకటన విడుదల చేశారు. కులగణన పేరుతో బిసిల జనాభాను తగ్గించి, జిఒ తెచ్చి, అదే జిఒను రెడ్డిల ద్వారా హైకోర్టులో కేసు వేయించి కొట్టేసే విధంగా కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. జిఒను ఇవ్వమంటూ డిమాండ్ చేసిన బిజెపి గవర్నర్ వద్దే ఆర్డినెన్స్ అట్టిపెట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేయాలి

- గ్రూప్-1 రీ ఎగ్జామినేషన్ నిర్వహించాలి : కవిత



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను వెంటనే ప్రక్షాళన చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్రూప్-1లో అక్రమాలు, నిరుద్యోగుల సమస్యలపై జాగృతి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. గ్రూప్-1 నోటిఫికేషన్ నుంచి మొదలుకుని నియామకాల వరకు పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మెరిట్ లిస్టులో 419.5 మార్కులు వచ్చిన వికలాంగురాలైన అభ్యర్థిని కాకుండా 32 మార్కులు తక్కువ వచ్చిన అదే కోవకు చెందిన అభ్యర్థినికి ఎలా ఉద్యోగం ఇస్తారని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల వారికి రిజర్వేషన్లు కల్పించడం, మెరిట్ లిస్టును పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో పెట్టకపోవడం లాంటి అనేక అవకతవకలు జరిగాయని అన్నారు. స్థానిక అభ్యర్థులకు అన్యాయం జరిగేలా తీసుకొచ్చిన జిఒ నంబర్ 29ని వెంటనే రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ గ్రూప్-1 ఉద్యోగాలను అమ్ముకుందని ఆరోపించారు. ఇప్పుడిచ్చిన ఉద్యోగాలు రద్దు చేసి...మళ్లీ రీ ఎగ్జామ్ పెట్టేలా సర్కార్‌పై ఒత్తిడి పెంచేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. ఈ నెల15న హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుపై విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని చెప్పారు. హైకోర్టు తీర్పు తర్వాత అవసరమైతే సుప్రీం తలుపు తడతామన్నారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. విద్యార్థులకు జాగృతి భరోసాగా ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రూప్-1 పరీక్ష రాసిన పలువురు అభ్యర్థులు తమకు జరిగిన అన్యాయాన్ని సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో అశోక్, మహేందర్, కూరపాటి శ్రీను, రవి రాథోడ్, జాగృతి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సామాన్లు జప్తు చేస్తున్న ప్రభుత్వ సిబ్బంది

జగిత్యాల ఆర్‌డిఒ కార్యాలయ సామగ్రి జప్తు

- హర్షం వ్యక్తం చేసిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి - నిజామాబాద్ రైల్వేలైన్ కోసం సేకరించిన భూములకు చెందిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో.. కోర్టు ఆదేశాల మేరకు జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలోని సామగ్రిని గురువారం జప్తు చేశారు.

ఈ చర్యపై బాధిత రైతులు హర్షం వ్యక్తం చేశారు. సుమారు 23 ఏళ్లడ్ల క్రితం పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వే లైన్ కోసం జగిత్యాల పరిధిలో రైతుల నుంచి సుమారు 100 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అప్పట్లో ప్రభుత్వం ఎకరాకు కేవలం రూ.1.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. విలువైన భూములు కోల్పోతున్నామని రైతులు సివిల్ కోర్టును ఆశ్రయించగా, 2010లో న్యాయస్థానం ఎకరాకు రూ.10లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఆర్‌డిఒ హైకోర్టును ఆశ్రయించగా 2014లో న్యాయస్థానం విచారణ జరిపి పరిహారాన్ని ఎకరాకు రూ.15 లక్షలకు పెంచుతూ ఆదేశించింది.

మరోసారి ప్రభుత్వం తరపున ఆర్‌డిఒ సుప్రీంకోర్టుకు వెళ్లగా, 2018లో సర్వోన్నత న్యాయస్థానం సివిల్ కోర్టు ఉత్తర్వులను సమర్థిస్తూ ఎకరాకు రూ.10లక్షల నష్టపరిహారంతో పాటు ఇతర చార్జీలను రైతులకు చెల్లించాలని స్పష్టం చేసింది.

ఆలస్యం కారణంగా జప్తు..

సుప్రీంకోర్టు తీర్పు వచ్చినప్పటికీ ఇంతవరకు రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదు. దాంతో బాధిత రైతులు తిరిగి కోర్టును ఆశ్రయించారు. ఆగ్రహం వ్యక్తం చేసిన సివిల్ కోర్టు గురువారం జగిత్యాల ఆర్‌డిఒ కార్యాలయంలోని సామగ్రిని జప్తు చేయాలని ఆదేశించిన మేరకు చేశారు.

ఐసెట్‌లో మిగిలిన 7,489 సీట్లు

- ప్రత్యేక విడతలో 30,371 మందికి కేటాయింపు
- 13న సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా గురువారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఐసెట్‌లో 37,860 సీట్లుంటే, 30,371 (80.2 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. 7,489 (19.8 శాతం) సీట్లు మిగిలాయని వివరించారు. 72 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. 276 ఎంబిఎ కాలేజీల్లో 30,587 సీట్లుండగా, 25,743 (84.1 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. 4,844 (15.9 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. 79 ఎంసిఎ కాలేజీల్లో 7,273 సీట్లున్నాయని తెలిపారు.

4,628 (63.6 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. ఇంకా 2,645 (36.4 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 942 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు, కాలేజీల్లో రిపోర్టు చేసేందుకు ఈనెల 13 వరకు గడువుందని పేర్కొన్నారు. లేదంటే సీటు రద్దవుతుందని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫ్యాబ్ ఇండియా దీపావళి 2025 కలెక్షన్స్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ప్రముఖ టెక్స్‌టైల్ ఉత్పత్తుల కంపెనీ ఫ్యాబ్ ఇండియా స్వర్నిమ్ పేరిట దీపావళి 2025 కలెక్షన్స్ విడుదల చేసింది. కలెక్షన్‌లోని ప్రతి ఉత్పత్తి, భారతీయ పనితనం పట్ల ఫ్యాబ్‌ఇండియా నిబద్ధతను ప్రదర్శిస్తుందని పేర్కొంది. ఈ కలెక్షన్ మొత్తం కుటుంబానికి ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పండుగ దుస్తులను అందిస్తున్నామని తెలిపింది.



పురుగుమందు డబ్బాలతో మహిళలు

రుణాలు చెల్లించినా.. మళ్లీ చెల్లించాలని ఒత్తిడి

- పురుగుమందు డబ్బాలతో మహిళల నిరసన
- వేములవాడ యూనియన్ బ్యాంకు ఎదుట ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రుణాలు చెల్లించినా.. మళ్లీ చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు మహిళలు పురుగుల మందు డబ్బాలతో వేములవాడలోని యూనియన్ బ్యాంక్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం కోనాయపల్లి గ్రామానికి చెందిన మహిళలు.. తమ రుణాలను ఇప్పటికే చెల్లించినప్పటికీ, బ్యాంకు అధికారులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 14న 'శ్రీనిధి సొమ్ములు స్వాహా' అనే ప్రత్యేక కథనం నవతెలంగాణలో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆ కథనం వెలువడిన అనంతరం జిల్లా అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో కొంతమంది మహిళలు గ్రూప్ లీడర్లు, ఆర్‌పిలకు రుణాల డబ్బు చెల్లించినప్పటికీ, వారు ఆ సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా తమ అవసరాలకు వాడుకున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకు అధికారులు సంబంధిత సంఘాల సభ్యులకు నోటీసులు పంపించారు. కోనాయపల్లి మహిళలు ఉదయం బ్యాంకు ఎదుట పురుగుమందు డబ్బాలతో నిరసన చేపట్టారు. తమవద్ద మెప్మా ప్రతినిధులకు చెల్లించిన రసీదులు, ఆధారాలు ఉన్నప్పటికీ, బ్యాంకు అధికారులు బకాయిలు ఉన్నట్టు చూపుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన ఆడిట్ తనిఖీల్లో కూడా కొన్ని ఆర్థిక లోపాలు బయటపడ్డట్టు సమాచారం. ఆడిట్ అనంతరం బకాయి మొత్తాన్ని చెల్లించాలని అధికారులు సూచించగా, మహిళలు దీన్ని వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు.



అలయ్ బలయ్ వేడుకల్లో పాల్గొన్న పలువురు నాయకులు

లండన్‌లో అలయ్ బలయ్

- ఐక్యతకు చిహ్నంగా వేడుకలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దసరా వేడుకల సందర్భంగా సీకా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో లండన్‌లో రెండో సంవత్సరం అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరిగాయి. కుల, మత, రాజకీయ, రాష్ట్ర భేదాలను అధిగమించి అన్ని తరగతుల తెలుగు ప్రజలు ఒకే వేదికపై కలుసుకున్నారు. ప్రవాస జీవితంలో చాలామంది ఎన్‌ఆర్‌ఐలు వృత్తి, రాజకీయాలు , సామాజిక వర్గాల కారణంగా విడిపోయిన నేపథ్యంలో, అలయ్ బలయ్ ద్వారా ఒక్కతాటిపైకి తెచ్చే వేదికగా నిలిచింది. తెలంగాణ సంప్రదాయ వంటకాలు, ముఖ్యంగా పిండివంటలు, ప్రత్యేకంగా భారతదేశం నుండి తెప్పించి అందరికీ రుచిచూసేలా చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ సంస్కృతి , సాంప్రదాయాల నేపథ్యంలో వేడుకలు ఉత్సాహంగా లండన్‌లో నిర్వహించారు. స్థానిక మాజీ ఎంపి వీరేంద్ర శర్మ ముఖ్య అతిథిగా హాజరై "సాంస్కృతిక ఐక్యత కోసం చేసిన ఈ ప్రయత్నం ఎంతో ప్రశంసనీయమని" పేర్కొన్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్, టిడిపి, జనసేన, బిజెపి వంటి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు పాల్గొని, రాజకీయాలకు అతీతంగా చేపట్టారు. కొంతమంది "ఇరవై ఏళ్ల తర్వాత మేము పాత స్నేహితులను కలుసుకున్నాం. వృత్తి, జీవనశైలి కారణంగా దూరమైన స్నేహాలు మళ్లీ పునరుజ్జీవించాయని' భావోద్వేగంతో అన్నారు. వందలాది మంది ప్రవాస భారతీయులు పాల్గొని , వంటకాలు, సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు.

బిసి రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం

- వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవి రమణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉద్దేశపూర్వకంగానే బిసిలకు బిజెపి అన్యాయం చేస్తున్నదని తెలంగాణ వృత్తిదారుల సమన్వయం కమిటీ కన్వీనర్ ఎంవి రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం కోసం ఆ బిల్లును పంపారనీ, ఆరు నెలలయినా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం వల్లనే హైకోర్టులో స్థానిక సంస్థల ఎన్నికలపై స్టే ఇచ్చారని గుర్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇవ్వడానికి మాత్రం రాత్రికి రాత్రే ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. ఉన్నత కులాల వారి మీద ఉన్న ప్రేమ బిసిల పట్ల లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి ప్రధానినని చెబుతున్న మోడీ బిసిలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధమైన చర్యలన్నీ తీసుకుని, అన్ని రాజకీయ పార్టీలను, బిసి సంఘాలను కలుపుకుని చిత్తశుద్ధితో ఈ ప్రక్రియను అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయంగా ఇవ్వాల్సిన 42 శాతం రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.



జిసిసిల గమ్యస్థానంగా తెలంగాణ

- మూడేళ్లలో 40 శాతం ఇక్కడే ఏర్పాటు
- ఎక్స్‌ఫెనో సిఇఒ పడమదన్ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జిసిసి)లను ఆకర్షించడంతో తెలంగాణ టాప్‌లో ఉందని ఎక్స్‌ఫెనో నివేదిక వెల్లడించింది. గత మూడేళ్లలో దేశ వ్యాప్తంగా కొత్త గ్రీన్‌ఫీల్డ్ జిసిసిలో 40 శాతం తెలంగాణలో ఏర్పాటు చేయబడ్డాయని తెలిపింది. జిసిసిలు అనేవి బహుళజాతి సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాల కోసం ఏర్పాటు చేసే ఆఫ్‌షోర్ యూనిట్లు. ఇవి ఐటి సేవలు, ఫైనాన్స్, హెచ్‌ఆర్, డేటా అనలిటిక్స్, ఆర్‌అండ్‌డి, కస్టమర్ సపోర్ట్ వంటి వివిధ విభాగాలకు సంబంధించిన సేవలను అందిస్తాయి. జిసిసి కేంద్రంగా తెలంగాణ ఎదుగుతోందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎక్స్‌ఫెనో సిఇఒ ఫ్రాన్సిస్ పడమదన్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ 40 శాతం జిసిసిలను ఆకర్షించగా.. తర్వాత స్థానంలో బెంగళూరు 33 శాతం వాటాను కలిగి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచవ్యాప్తంగా వ్యాపార కేంద్రంగా వేగంగా ఎదుగుతోందన్నారు. అధిక నాణ్యత కలిగిన ప్రతిభావంతులు, వలస ధోరణులు ఇందుకు ప్రధాన మద్దతును అందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 360కి పైగా జిసిసిలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో 3.1 లక్షలకుపైగా నిపుణులు పని చేస్తున్నారన్నారు. ఇది రాష్ట్రంలోని మొత్తం వైట్ కాలర్ వర్క్‌ఫోర్స్‌లో 14 శాతం కంటే ఎక్కువని ఎక్స్‌ఫెనో సహ వ్యవస్థాపకుడు కమల్ కరంథ్ తెలిపారు. ఇక్కడ ప్రతిభావంతుల ప్రవాహం, లీడర్‌షిప్, వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. జిసిసి మొత్తం ఉద్యోగాల్లో ఇంజినీరింగ్, ఐటి రోల్స్ 57 శాతం వాటాను కలిగి ఉన్నాయన్నారు.